


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### కరోనా డయిరీస్

**2020 జనవరి** మాసం చాలా సంతోషంగా వున్నాం. మార్చ్ దాకా విచ్చలవిడిగా తిరిగాం. 2019 నవంబర్ నుండే చైనాలో యూహాన్‌లో ఏదో రోగం వండబడింది. అన్ని దేశాలకీ 'గిఫ్ట్ డీడ్' వస్తోంది అన్న న్యూస్ వచ్చింది కూడా. చైనాలో ఏది వండాలో ఏది చూసి వదిలెయ్యాలో తెలీని దేశం. మనం గుడ్ల గూబల్నీ, గబ్బిలాల్నీ, తేళ్ళనీ, పాముల్నీ చూసి వదిలెయ్యడమో లేదా ఏ దేవతల వాహనాలుగానో, ఉపకరణాలుగానో పేరు పెట్టి పూజించడమో చేస్తాం.

ఫర్ ఎక్జాంపుల్ పాము ఆదిశేషుడు. అంటే విష్ణుమూర్తి బెడ్ గరుత్మంతుడు అంటే వాడుక భాషలో గద్ద అనుకోవచ్చు. అది ఆయన వాహనం. గబ్బిలం లక్ష్మీదేవి వాహనం. ఎలుక వినాయకుడి వెహికిల్ లాజిక్స్ అడగం. జస్ట్ వీ ఏక్సెప్ట్. ఇండియన్ మైథాలజీలో వున్న బ్యూటీనే అది. సో ఇన్ని వెహికిల్స్‌నీ, బెడ్స్‌నీ, టేబుల్స్‌నీ తింటాం అంటే ఎలా? వీలుకాక వదిలేసారు కానీ ఇనుమూ, ఇటుకా, ఇసుకా కూడా తినడం మొదలు పెడితే దేశాలు దేశాలే తినేయగలరు. అసలు చైనాకి వెళ్ళాలంటేనే మన ఇండియన్ ఫిల్మ్ ఏక్టర్స్ భయపడ్డారు. ఒక్క షారూక్ ఖాన్ వెళ్తే, వాళ్ళు నకళ్ళు వేలమంది షారూక్ ఖాన్‌లని తయ్యారు చేసి చౌకగా మార్కెట్‌లో పెడ్తారు. ఏంటి? రెమ్యునరేషన్ ప్రోఫిట్‌లో 50శాతం అడుగుతున్నాడా? తీసుకోండి ఎమెజాన్ డెలవరీ పదికోట్లకి షారూక్‌ని పంపిస్తాం "కి...కి ....కి...కి కిరణ్‌లో. ఇంకో ఐదు 'కి'లు ఎక్స్‌ట్రా. స్టాక్ లిమిటెడ్ ఆర్డర్ ఇమీడియెట్లీ.

ఇదీ చైనావాళ్ళ తంతు. చైనా వాల్‌లో సగం బ్రిక్స్ తినేసారని జనం ఉవాచ. వాళ్ళు తిననిది ఏదీలేదు. వాళ్ళ సైజ్‌కి డబుల్ వున్నవి కూడా వదలరు. అయినా మన వాళ్ళకి మొదట నుండీ విదేశీ వస్తువ్యామోహమే. చైనావాడు వదిలేసిన ఫుడ్, వాడు తయారు చేసే డూప్లికేట్ గడియారాలు, కార్లు, వాషింగ్ మిషిన్స్, మిక్సర్ గ్రైండర్స్ అన్నీ. హోటల్ కెళ్ళి స్టైలుగా ఆర్డర్ ఇస్తారు "చైనీస్" అని. ఇంటికెవరైనా వస్తే "డూ యూ లైక్ చైనీస్?" ఇప్పుడు చెప్పమనండి "ఏం రోగం?" అనగానే "చైనీస్" అని. ఆమడ దూరం పారిపోతారు జనం.

అదేదో సినిమాలో చెప్పినట్లు దేవుడు ముద్దపప్పు ఇచ్చాడు. ఆవకాయ ఇచ్చాడు. రకరకాల కూరగాయలూ, పండ్లూ, ఏడుస్తున్నారని చేపా, గుడ్డూ, మేకా. అరే తృప్తి పడరే. వీళ్ళ శ్రాద్ధానికి గబ్బిలాల కూరొండి పెట్టా! అదేం తిండి? చీకట్లో ముసుగేసుకుని ఎవరి కంటా పడకుండా ఎగుర్తాయి పాపం అవి. మొహం ఎవరికీ కనపడకూడదని, కిందకేసుకుని తల్లకిందులుగా వూగుతాయి. వాటినీ బ్రతకనీయరా?

అవతార్ సినిమాలో ఎవరి అవతారాలన్నా మారుస్తాడు వాడు. మన రాముడూ, కృష్ణుడూ వాళ్ళ స్టైలు ఐకాన్స్ అయి, పాశ్చాత్య దేశాల్లో జుట్లు జడలు కట్టించుకుని, ముడులు వేసుకుని, నారబట్టలు, చీలికలూ, వాలికలూ వేసుకుని తిరుగుతున్నారు. నీలమేఘవర్ణం కోసం వంటినిండా పచ్చలు పొడిపించుకుంటున్నారు. పక్షులూ, లతలూ, సర్పాలూ అన్నీ పురాణాల్లో కామరూపాల్లా, యక్షుల్లా, నాగాల్లా, పుస్తకాలు 'మెలూహా' లాంటివి చదివి, వీళ్ళూ అఘోరాలకన్నా ఘోరంగా తయ్యారయి తిరగడం ఫ్యాషన్ అయింది. పుష్పక విమానాల్లా సొంత హెలికాప్టర్ల్లూ, ఇంద్రుడిలా బోలెడుమంది ప్రియురాళ్ళూ, పదవి కోసం కరవని గడ్డిలేదు.

ఫలానా మినిస్టర్ ఫలానా హోటల్ రైడింగ్‌లో ఫలానా సినిమా స్టార్‌తో పట్టుబడ్డాడు అంటే? ఎవరివల్ల? వాడికి సగమే అర్ధమయిన పురాణాలవల్ల. ఎవడైనా ఘోరంగా ఇంద్ర పదవి కోసం తపస్సు చేస్తుంటే, రంభ, ఊర్వశిలని పంపించడం రివాజు. అలాగే ఈ బ్రోకర్‌లు ఏ మినిస్టర్ పదవి అయినా వూడగొట్టాలంటే ఇప్పటి అప్సరసల్ని పంపిస్తున్నారు.

జాతిని మార్గదర్శకం చేసి "ఇహం" బ్రహ్మాస్మి మోక్షానికి దగ్గర దారి అని చెప్పే ఓషో సిద్ధాంతాలూ, ఇప్పటి నిత్యానందలూ వుండనే వున్నారు. ఏమైనా అంటే వాళ్ళ భక్తులు. మీరు పదహారు వేలమందితో రాసకేళి చేసిన కృష్ణుడ్ని ఆరాధిస్తున్నారుగా? మా బాబా చేస్తే తప్పా? అంటారు బక్వాస్ ఫెలోస్. కృష్ణుడు చక్రం పట్టి రాక్షసుల్ని హతమార్చాడు. నోట్లో లోకాలనీ, ఆకాశం అంత ఎత్తుకి ఎదిగి విశ్వరూపాన్ని చూపించి "నేను దేవుడ్ని" అని చాటి చెప్పాడు. చంపేదీ.. నేనే.. చంపబడేదీ నేనే. ఎవ్విథింగ్ ఇన్ ద యూనివర్స్ నేనే. ఆ చీమా.. ఖడ్గమృగం నువ్వూ, మినిస్టరూ నీ అభిమాన హీరోనీ" అని భగవద్గీతలో తేల్చి చెప్పాడు. సరిగ్గా చదవరు. వినరు. విన్నా అర్ధం చేసుకోరు.

ఆయన చేసాడని వీళ్ళూ చెయ్యడమేనా? ఆయన గోవర్ధన పర్వతాన్ని గొడుగులా ఎత్తి, ఊరందరినీ రక్షించాడు. వీళ్ళు తమ గొడుగులు సెక్రెటరీల సాయంలేకుండా తెరవలేరు. సినిమాలు చూసికాదు, థియరీ చదివి పరీక్షలు రాయాలి. భగవద్గీత, భాగవతంలో ఆయన ప్రతికాండకీ కారణం చెప్తూనే వచ్చాడు. పదహారు వేల భార్యలకీ ఆ రోజుల్లో ఫ్యామిలీ ప్లానింగ్ లేదు కాబట్టి, ఒక్కొక్కళ్ళకి పదిమంది పుట్టినా ఎన్నివేలమంది సేన తయారవుతారు? అదేదో ఇంగ్లీషు సినిమాలో గురువు శిష్యుడ్ని "why do you marry?" అంటే, శిష్యుడు తడుముకోకుండా "To make my own people" అని చెప్తాడు. కృష్ణుడికి ఫ్రెండ్స్‌ని ఎలా చూడాలో తెలుసు, ఎంతివ్వాలో తెలీకపోతే ఆపడానికి పక్కన భార్యని తీసుకెళ్తాడు. కుచేలుడికి మూడు గుప్పెళ్ళ అటుకులు తిని వరాలు ఇవ్వగానే , నాలుగో గుప్పెడుకి పక్కనున్న రుక్మిణి కంట్రోల్ చేసింది. నరకాసురుడితో యుద్ధం చేసి అలిసిపోయి కునుకు తీస్తే, సత్యభామ విల్లు పట్టింది. లోకకళ్యాణం, కోసం ఆయన ఎన్ని పెళ్ళిళ్ళు అయినా చేసుకుంటాడు. నీ కళ్యాణం కోసం ఒక్క పెళ్ళి చేసుకుని, వాళ్ళని వుద్ధరించు చాలు. కృష్ణ తత్వం ఎవరికి సంపూర్ణంగా అర్ధం అవుతుంది చెప్పండి? కృష్ణుడ్ని దొంగనీ, వుమెనైజర్ అనీ అనే వాళ్ళని చెప్పుతో కొట్టాలి.

ఆ దొంగతనం తమ ఇంట చెయ్యడం కోసం గోపెమ్మలు తహ తహలాడేవారు. బృందావనంలో ఆడవాళ్ళేనా? ఆయన మురళీరవం విని పురుషులు సైతం పులకించిపోయేవారుట. అసలు శ్రీరాముడి మోహన రూపాన్ని చూసి మునులంతా "మమ్ము అనుగ్రహించు.. ఆడవాళ్ళమైపోతాం.. పెళ్ళాడు" అంటే కదూ, శ్రీరాముడు వచ్చే జన్మలో చేసుకుంటాను, మీరంతా గోపెమ్మలై పుట్టమన్నాడు. జాంబవంతుడూ "రామా నీతో ఫైటింగ్ చేస్తా" అని తన సహజ సిద్ధమైన కోరిక కోరితే "వచ్చే జన్మలో నీ కోరిక తీరుస్తా" అన్నాడు. శమంతకమణి వంకతో వెళ్ళి, కోరిక తీర్చి, అతను "ఇంక పోతా నా కోరిక తీరిందిగా అని జాంబవంతుడు పోతే" అనాథ అవకుండా అతని కోరిక మీద అతని కూతుర్ని పెళ్ళిచేసుకున్నాడు. తీరా శమంతకమణిని సత్రాజిత్తుకివ్వగానే, తను వేసిన బ్లేమ్‌కి గిల్టీగా ఫీలయి సత్యభామనీ, మణినీ కూడా కృష్ణుడిని తీసుకోమని కాళ్ళమీద పడితే కృష్ణుడు ఏం చేస్తాడూ? కాళ్ళ దగ్గర ఏం పెట్టినా తీసుకుంటాడు.

రుచీపచీలేని మా బాలా త్రిపురసుందరి పెట్టే పులిహోరనీ, చెక్కముక్కలాంటి గారెల్నీ, ఉప్పు కషాయంలాంటి పొంగలినీ, బెల్లంలేని పాయసాన్ని కూడా తీసుకుంటాడు. బావర్చీ నుండి బిరియానీ అయితేనే తింటా అనడు. అందుకే ఆయన దేవుడు. ఆయన్ని చూసి దొంగతనాలూ, పెళ్ళిళ్ళూ చేసుకునేవాడికి ఇంత సింపుల్ లైఫ్ వుంటుందా? అసలు వినాయక చవితి వ్రత కథ చదవమనేది ఇవన్నీ

తెలుసుకోమనే. గబగబా ఎక్కాలు వప్పచెప్పినట్లు చదివి, ఆకులో పెట్టిన ఉండ్రాళ్ళూ, కుడుంలూ మొక్కడం కాదు'' వింత మానిసి వచ్చెననుచు దాది కేకలు వేచెను. అంత ఉయ్యాలలోని బాలిక ఏడ్వదొడంగెను..'' మాకు కంఠతా వచ్చు. మావిళ్ళ వారు వేసినా మరొకరు వేసినా ఇదే భాష ఇవే డైలాగులు. ''రోజుకి ఎనిమిదివేల బారువులు బంగారు కణికలు పెట్టు మణిని, ఏ మందమతి అయినా ఎవరికైనా ఇచ్చునా?'' అన్నాడు సత్రాజిత్తు. ''ఇట్స్ ఓకే'' అని వచ్చేసాడు అంతటి దేవుడు. మన హీరోల్లా వెంటనే రామలక్ష్మణ్‌లు కంపోజ్ చేసిన ఫైట్స్ చెయ్యలేదు. తర్వాత తనమీద నేరం పడితే, అది బాపుకోటానికి వెళ్ళాడు. నిజమైన దొంగని పట్టివ్వడానికి. ఈ ఫార్ములాతో ఆ తర్వాత బోలెడన్ని సినిమాలొచ్చాయి. ''ఒక్క అవకాశం ఇవ్వండి ఇన్‌స్పెక్టర్. నేను అసలైన దొంగని పట్టి తీసుకొస్తాను. ఒక్కసారి జైలు తలుపులు తియ్యండి'' అంటే, ఇన్‌స్పెక్టర్ రూల్స్ అవీ లెక్కపెట్టకుండా స్క్రీన్ ప్లే ముఖ్యం అనుకుంటే 'డాన్', లేదు నాకు రూల్సే ముఖ్యం అంటే ''ఖైదీ'' బాక్స్ ఆఫీసులు బద్దలు కొట్టాయి.

భాగవతం ''మేడ్ ఈజీ'' కథలు కానీ నేను రాస్తే ఈ యో యో (YO YO) బాచ్‌కి అర్థం అవ్వచ్చు. ప్రతివాడూ దేవుళ్ళనీ పురాణాలని విమర్శించేవాడే మహామహులకే ఆ బ్రహ్మ తత్వం అర్థం కాలేదు. మా చిన్నప్పుడు అనసూయా వాళ్ళమ్మ ఏం వండి తీసుకువచ్చినా, భానుమతీ రామకృష్ణగారి అత్తగారి కథల్లో గుండు మణి వండిన బాదంకీర్‌ని చూసి అడిగినట్టు ఈ బ్రహ్మ పదార్థమేమిటి?'' అనేవాడు మా నాన్న. ఏదైనా అర్థంకాకపోతే బ్రహ్మ పదార్థం అనీ, ఏ విషయం అయినా అర్థంకాకపోతే బ్రహ్మ తత్వం అనీ అంటారని నాకు చిన్నప్పుడే తెలిసింది.

ఈ రామాయణం, బారతం, భాగవతంమీద కోట్లు చేసుకున్న ప్రొడ్యూసర్, డైరెక్టర్‌లకి పెద్దగా తెలియదు. హీరో అంటే విలన్‌ని ఎంత భయంకరంగా వీలైతే అంత భయంకరంగా హెలికాఫ్టర్‌లో, సబ్ మెరైన్‌లో, రేస్ కారులో, ఎడ్ల బండిమీదో, గుర్రం మీదో వెంటాడి చంపెయ్యడమే అనుకుంటారు. వెనుక బ్యాక్ గ్రౌండ్‌లో ''సంభవామి యుగే యుగే'' టైటిల్ మ్యూజిక్. ఎంత అలుసో వీళ్ళకి భగవద్గీత.

రాముడూ పధ్నాలుగేళ్ళు వనవాసం చేసాడు. కటికనేలమీద పడుకున్నాడు. యూ ఫోమ్ బెడ్స్‌లేవు. అడవి అది. చీమలూ, దోమలూ, తేనెటీగలూ, తేళ్ళూ, గొంగళి పురుగులూ, మండ్రగబ్బలూ ఎన్ని కుట్టాయో? ఆయన్ని అనుకరించే ఈ మానవులలా, వేనిటీ వ్యాన్‌లూ, కార్‌వాన్‌లూ, ఏసీ బంగళాలూ వుండాలనుకోలేదు. చలికి ఉన్నికోట్లూ, బ్లేజర్లూ, సన్‌గ్లాసెస్, రెయిన్ కోట్స్ ఇవేం లేవు. అందుకే ఆయన దేవుడు.


ఇప్పటి లీడర్స్‌కి పెళ్ళిళ్ళూ, పదవులు కొట్టేయడం విషయంలో స్కామ్‌ల్లో, బోలెడు పురాణాలు జ్ఞాపకం వస్తాయి. కానీ ఆయన దేవుడు ఎట్లా అయ్యాడో అది తెలియదు. పాయసం పెడ్తే పిల్లలు పుడ్తారా? భూమి దున్నితే పుడ్తారా? అని బోలెడు సెటైర్లు. మరి చిన్నప్పుడు పిల్లలకి నానమ్మలు ఏమని చెప్తారు? అట్లాగే చెప్తారు మరి. ఇప్పటి టెంకలయితే మూడో ఏటికే ''వినో రిప్రొడక్షన్ గ్రానీ.. డోంట్ ట్రై టు టెల్ కాక్ అండ్ బుల్ స్టోరీస్'' అంటారు. కానీ సూపర్ మేన్ స్టోరీస్ నోరు తెరుచుకుని చూస్తారు. హారీపాటర్ సిరీస్ ఇంట్లో వుండడం ప్రిస్టేజ్. కాశీమజిలీ కథలూ, సహస్ర శిరశ్ఛేధ అపూర్వ చింతామణిలో లాజిక్‌లూ, రీజనింగులూ వెదుకుతారు. అశోక్ బాంకర్ రామాయణం ప్రకారం ''దశరథా వాజ్ ఎ విలన్ రావణా వాజ్ ఏ హీరో'' అనెయ్యగలరు.

అసలు ఏ దేవుడూ పాలు పోసి, డ్రైనేజ్‌లో వేస్ట్ చేసి అభిషేకాలూ, అంటు రోగాలు అంటుకునే కుంభమేళాలూ, పుష్కరాలూ చెయ్యమనలేదు. నేతిలో లడ్డూలూ, హుండీల్లో నిలువు దోపిడీలూ అడగలేదు. చివరకి నీకు పనికిరాని తల వెంట్రుకలు కూడా అడగలేదు. అవి పెద్ద ఎత్తున ఎగుమతి అయి దేవాదాయశాఖకి పెద్ద ఆదాయం అనుకోండి. ఆయన ఏం అడిగాడో ఒకసారి ఏ పురాణమైనా పారాయణం అయినా చదివి చూడండి. శ్రద్ధా...సాబూరీ కొద్దిగా జీవితంపట్ల నీతి నియమాలూ, కట్టడులూ, సంఘజీవితం, సాటి మనిషి పట్ల సానుభూతి, ప్రేమా, దౌర్జన్యం చేయపోవడం.

ఈ ఎథిక్స్ అన్నీ పదవికోసమో, సుఖం కోసమో, మత్తుకోసమో డబ్బు కోసమో తుంగలో తొక్కి మానవుడు అంతరిక్షంలోకి ఎగిరానూ, మనిషికి ప్రతి సృష్టిలా రోబోని తయ్యారు చేసానూ, అన్ని గ్రహాలమీదా రియల్ ఎస్టేట్ బిజినెస్ పెడ్తానూ అనడం వరకూ బానేవుంది. కానీ ఆడపిల్ల పుట్టిన దగ్గరనుండీ ఆమెని ఓ కమోడిటీగా చూసి, ఆ శరీరంతో వ్యాపారమా? వాళ్ళని వస్తువుల్లా ఎగుమతులా? అతి పెద్ద వ్యాపారాలు ఒకటి డ్రగ్స్, రెండు స్త్రీనా? ఓరి మీ పిండం చైనా గబ్బిలాలకి పెట్టా! స్త్రీని పూజించమన్న గడ్డమీద కనీసం మనిషిలా చూసి రక్షణని ఇవ్వండిరా. 2012 నుండీ 2019 వరకూ రికార్డ్ అయిన రేప్ కేసులు ఎన్నో తెలుసా? ఆడలేదు, మగలేదు లైంగిక దాడులూ, బ్లాక్ మనీ, రాజకీయ హత్యలూ, హానర్ కిల్లింగ్స్, స్కాములూ, చీకటి వ్యాపారాలూ. మూఢనమ్మకాలూ, నరబలులూ రైస్ పుల్లింగులూ, కిడ్ నేపులూ, భ్రూణ హత్యలూ, ఓ నీతీ జాతీలేని దుర్మార్గపు దారుణ కాండలతో, వికృత చేష్టలతో భూమికి చేటు తెచ్చారు. ఆ నీఛత్వం మొయ్యలేక భూదేవి ఆక్రందనలు చేస్తే, ప్రకృతి విలయతాండవం చేసింది. ఆకాశం ఆక్రోశించింది. ఎన్ని పేరడీలు చేసినా, కామెడీలు చేసినా మన అజ్ఞానానికి నవ్వుకున్న దేవుడు ఒక పాఠం చెప్పే టైం వచ్చింది అనుకున్నాడా? కరోనా కరాళ నృత్యాన్ని చేతులారా తెచ్చుకున్న మానవుడికి బుద్ధి చెప్పాలని ఓ మొట్టికాయ వేసాడా? ఏమో కానీ ఎలక్షన్స్ కుంభమేళాలూ, సమ్మర్ వెకేషన్స్, పార్టీలూ, చేసుకుని కరోనా కట్టడులు మాస్క్, శానిటైజర్, సోషల్ డిస్టెన్సింగ్ని తుంగలో తొక్కిన మూర్ఖులవల్ల, అమాయకులు బలయ్యారు. మొదటిది చైనా వాడి గిఫ్ట్ అయితే, ఇండియాలో సెకెండ్ వేవ్ ఇంత దారుణంగా ఉండటానికి కారణం మన మూర్ఖత్వానికి ఫలితమే.

ఆ దేవుడు కరుణామయుడు ఇప్పటికీ ఒక అవకాశం ఇస్తున్నాడు. వేక్సినేషన్లు వేసుకుని, నిబంధనలు పాటించండి, మనం మళ్ళీ ముందటిలా ముసుగులు లేకుండా, చెయ్యీ చెయ్యీ కలిపి బ్రతకొచ్చు. ఏ తండ్రి అయినా మొట్టికాయ వేస్తాడే కానీ బిడ్డల్ని మట్టుబెట్టడు. తప్పక రక్షిస్తాడు. ఇది శిక్ష కాదు శిక్షణ.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4